నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, బుధవారం 11 జూన్ 2025 | ADILABAD NIRMAL

## పోలీస్ సబ్ కంట్రోల్ రూం ప్రారంభం



కంట్రోల్ రూం ప్రారంభించిన ఎస్పీ, ఎల్‌డీఎం బ్యాంక్ అధికారులు

ఎదులాపురం, జూన్ 10 ః నేరాల నియంత్రణకు పోలీస్ సబ్ కంట్రోల్‌లు దోహద పడుతాయని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నిత్యం రద్దీగా ఉంటూ ప్రజలతో నిండి ఉండే శివాజీ చౌక్ వద్ద పోలీస్ సబ్ కంట్రోల్ రూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శివాజీ చౌక్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, నేరాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండడానికి ప్రారంభించామన్నారు. సిబ్బంది ఉదయం నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉంటారన్నారు. బ్యాంకును పరిశీలించి బ్యాంకులో ఉన్న లాకర్లకు భద్రత విషయంలో తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. అలారం సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, పట్టణ సీఐలు బి.సునీల్‌కుమార్, సిహెచ్ కరుణాకర్‌రావ్, మున్సిపల్ డీఈఈ కార్తీక్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ జి.రామచంద్ర రావ్, సత్యనారాయణ, సురేష్, శ్రీధర్, ఉత్పల్ పాల్గొన్నారు.



ఏసీబీకి పట్టుబడిన ఇన్‌చార్జి ఆర్ఐ సంతోష్, బిల్ కలెక్టర్ షోయబ్

ప్రతి పనికో రేటు

# అవినీతి బల్దియా

## లంచాలకు కేరాఫ్‌గా నిర్మల్ మున్సిపాలిటీ

- వరుస ఘటనలు జరుగుతున్న మారని తీరు
- పట్టుబడుతున్న అవినీతి అధికారులు
- ప్రజల్లో వెల్లివిరుస్తున్న చైతన్యం




నిర్మల్ అర్బన్, జూన్ 10 ః నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ప్రతి పనికి ఓ రేటు కట్టి మరీ పైసలు వసూలు చేస్తున్నారు. కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా పని కావడం లేదు. దీంతో కొందరు పైసలు ఇస్తూ పనులు చేయించుకుంటుండగా.. మరీ కొందరు అవినీతి అధికారుల భరతం పడుతున్నారు. అవినీతి నిరోదక శాఖ(ఏసీబీ)ను ఆశ్రయిస్తూ పట్టిస్తున్నారు. ఏసీబీ దాడుల్లో అత్యధికంగా మున్సిపల్ కార్యాలయం సిబ్బంది ఉండడం.. ఇందులో రెవెన్యూ శాఖలోనే పట్టుబడడం విమర్శలకు తావిస్తున్నది. కాగా.. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు కావాల్సిన పనులు చేయాలి. ఇందుకోసం సర్కారు వారికి జీతాలు చెల్లిస్తున్నది. అవినీతికి అలవాటు పడిన అధికారులు లంచాల పేరిట సామాన్యులను వేధిస్తున్నారు. పైసలు ఇవ్వనిదే పని చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా పనిని బట్టి మూడు, ఐదు, ఏడు, 15 రోజుల్లో పనులు పూర్తి చేయాలి. కాగా.. అధికారులు లంచం అడిగితే 94404 46106 నంబర్‌కు సమాచారం అందించాలని ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు.



నిర్మల్ మున్సిపల్ కార్యాలయం

### జిల్లాలో ఘటనలు..

- తాజాగా నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. నూతనంగా ఇంటి నిర్మాణం చేస్తున్న యజమానికి ఇంటి నంబర్ జారీ చేయాల్సి ఉండగా.. అధికారులు లంచం అడిగారు. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఆర్ఐ సంతోష్, ఔట్ సోర్సింగ్ విభాగంలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న షోయబ్‌లు రూ.6 వేలు లంచం అడుగగా ఏసీబీని ఆశ్రయించి ఇద్దరిని పట్టించాడు.
- నిర్మల్ మున్సిపాల్టీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షాకీర్ ఖాన్ సర్వీస్ బుక్‌లో వివరాలు నమోదు చేసేందుకు బిల్ కలెక్టర్ నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డాడు.
- జనవరి 25న నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో గంగాధర్, బిల్ కలెక్టర్ నవంత్ ఇంటి అసిస్‌మెంట్‌కు రూ.3500 తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- దడువాయి (వే మాన్) లైసెన్స్ కోసం మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి తంగిడిపల్లి శ్రీనివాస్ రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు.
- ల్యాండ్ అండ్ సర్వే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ జగదీష్, అటెండర్ ప్రశాంత్‌లు సల్లా హరీశ్ నుంచి సేత్వార్ కోసం రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు.
- 2024 జనవరి 10న కడెం తహసీల్దార్ రాజేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ చిన్నయ్యలు గిఫ్ట్ డీడీకి రూ.9 వేలు లంచం ఇస్తుండగా పట్టుబడ్డారు.



సిర్పెల్లి(హెచ్)లో కూలిన పాఠశాల భవనం



రాజురాలో నెర్రలువారిన పాఠశాల గోడలు





వెనుక భాగం కూలి పోయి ముందు బాగం కూలేందుకు సిద్ధంగా ఉన్న కుభీర్‌లోని ఎంఆర్‌సీ భవనం

'ఫొటో'లో కనిపిస్తున్న పాఠశాల భవనం కస్ర గ్రామంలోనిది. ఇక్కడి పాఠశాలలో ఐదు తరగతులు ఉండగా.. 11 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒకే ఉపాధ్యాయురాలు జయంతి పని చేస్తారు. ప్రహరీ లేదు, తాగునీటి సౌకర్యం లేదు, టాయిలెట్స్ లేవు. గ్రౌండు లేదు. సుమారు 40 మందికి పైగా పిల్లలు కుభీర్, భైంసా, పల్సి లోని ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ఐదారేళ్లుగా పాఠశాల భవనం శిథిలమై కూలిపోయే పరిస్థితిలో ఉంది. ఇంకో భవనంలో ఐదు తరగతుల విద్యార్థులను ఒకే చోట కూర్చొబెట్టి ఒకే టీచర్ బోధిస్తున్నది. ఈ పరిస్థితుల్లో గ్రామంలోని నిరుపేద కుటుంబాల పిల్లలే చదువుతున్నారు. మిగతా వారు ప్రైవేటుకే వెళ్తున్నారు. ఇది పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న భద్రత. కూలిపోయే భవనాన్ని చూసి తల్లిదండ్రులు పాఠశాలకు పిల్లలను పంపడం లేదు.

# అధికారులూ.. కూలుతాయ్..

- శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల భవనాలు
- కుభీర్ మండలంలో 29.. భయాందోళనలో విద్యార్థులు

కుభీర్, జూన్ 10 ః కుభీర్ మండల విద్యావనరుల కేంద్రంతోపాటు పల్సి, సిర్పెల్లి(హెచ్), కస్ర, కుప్టి, రాజురా, ధార్‌కుభీర్, జాంగాం, పాత సాంవ్లి, సొనారి, రంజిని గ్రామాల్లోని 29 ప్రభుత్వ పాఠశాల భవనాలు ఏళ్లుగా శిథిలావస్థలో మగ్గుతున్నాయి. కొన్ని చోట్ల వాటినే వినియోగిస్తుండగా.. మరికొన్ని చోట్ల ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని తల్లిదండ్రుల్లో అభద్రతాభావం వ్యక్తం అవుతోంది. మండలంలో ఏడు హైస్కూళ్లు, 11 యూపీఎస్‌లు, 46 ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. కేజీబీవీ, ఏహెచ్‌ఎస్ డోడర్న, ఏహెచ్‌ఎస్ కుభీర్ సహా 3147 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు విద్యాశాఖ లెక్కలు చెబుతున్నాయి. చాలా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం, టీచర్ల కొరత వేధిస్తోంది. సంఖ్యకు తగ్గ ఉపాధ్యాయుల లేక ఒక్కో పాఠశాల మూతబడుతోంది. తాజాగా శుక్రవారం అంతర్ని గ్రామంలో పురాతన పాఠశాల భవనం ప్రమాదవశాత్తు కూలి పోవడంతో నలుగురు విద్యార్థులు గాయపడిన ఘటన తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నది. ఈ విషయమై ఎంఈవో విజయ్‌కుమార్‌ను అడుగగా.. పాడుబడ్డ, శిథిలమైన ప్రభుత్వ పాఠశాల భవనాలను గుర్తించి కూల్చి వేయమని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు పాఠశాలను ఆదివారం నుంచి సందర్శిస్తున్నారు. వారి నివేదిక ఆధారంగా చర్యలు చేపడతాం.

# బియ్యం కోసం డీలర్ల నిరీక్షణ

- రేషన్ కోసం ఎంఎల్ఎస్ గోదాం వద్ద బారులు

బియ్యానికి ఆదిలాబాద్ పౌర సరఫరాల శాఖ గోదాంకు వచ్చిన రేషన్ డీలర్లు



ఆదిలాబాద్, జూన్ 10(నమస్తే తెలంగాణ) ః మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ.. రేషన్ డీలర్లతోపాటు లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నది. మూడు నెలల కోట ఒకేసారి ఇస్తుండడంతో మొదటి విడుత కేటాయించిన కోట అయిపోగానే డీలర్లు తమకు రావాల్సిన మిగితా కోట కోసం పలుమార్లు పౌర సరఫరాల శాఖ గోదాంల వద్దకు రావాల్సి వస్తుంది. బియ్యం కోసం డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దకు వస్తే.. లబ్ధిదారులు దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. బియ్యం ఎప్పుడు ఇస్తారూ? అని డీలర్లను అడిగితే కోట రాగానే ఇస్తామంటున్నారు. డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద తమ కోటా కోసం పడిగాపులు కాస్తున్నారు. స్టేజ్-1 సరఫరా అయిన వెంటనే రేషన్ బియ్యాన్ని స్టేజ్-2 కింద డీలర్లకు పంపిణీ చేస్తున్నామని పౌర సరఫరాల శాఖ ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి మధూకర్ తెలిపారు. తమకు కేటాయించిన మూడు నెలల బియ్యం కోట అవసరమైన సమయంలో పంపిణీ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు.

- మీ పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి..
- అప్పుడే సర్కారు బడులపై నమ్మకం పెరుగుతుంది..
- ప్రైవేటు స్కూళ్లలో చేర్పించాలనే ప్రచారాన్ని మానండి..
- ఓ ఉపాధ్యాయ సంఘం యాత్రలో గ్రామస్థుడి ప్రశ్న
- వైరల్‌గా మారిన వీడియో

మాట్లాడుతున్న గ్రామస్థుడు రాజు



# ప్రభుత్వ ఉద్యోగం కావాలి.. సర్కారు చదువులు వద్దా..?

ఆదిలాబాద్, జూన్ 10(నమస్తే తెలంగాణ) ః ''ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ముందుగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.. ఆ తర్వాతనే ప్రైవేటు పాఠశాలలకు పంపవద్దని ప్రచారం చేయాలి.. అప్పుడే సర్కారు బడులపై నమ్మకం పెరుగుతుంది..'' అంటూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను స్థానికుడు రాజు ప్రశ్నించాడు. ఆదిలాబాద్ జిల్లా యాపల్‌గూడలో ఓ ఉపాధ్యాయ సంఘం యాత్ర చేపట్టగా రాజు ప్రశ్నించిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఇంటర్, డిగ్రీ చదువుకుని ఉంటారు. వారే మంచిగా బోధిస్తున్నప్పుడు అన్ని అర్హతలు ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎందుకు చెప్పడం లేదని నిలదీశాడు. ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం చేయడం పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేదనడమే అని అన్నాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు ఎందుకు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారని, తమ పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎందుకు చదువాలని ప్రశ్నించాడు. ప్రభుత్వ పాఠశాలలపై ఉపాధ్యాయులకు ఎందుకు నమ్మకం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఉండాలి. కానీ ప్రభుత్వ పాఠశాలల చదువులు ఎందుకు పనికి రావని ఆగ్రహం వ్యక్తం చేశాడు. రాజు చేసిన వ్యాఖ్యలు ప్రతి ఒక్కరిని ఆలోచింప జేస్తున్నాయి.



- రైతు భరోసా పంపిణీ చేయాలి..
- పీఎం కిసాన్ డబ్బులు, జొన్నల పైసలు అందించాలి..
- మాజీ మంత్రి జోగు రామన్న

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేశాయి

ఆదిలాబాద్, జూన్ 10(నమస్తే తెలంగాణ) ః కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాయమాటలతో రైతులను మోసం చేశాయని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. మంగళవారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ సర్కారు అమలు చేసిన రైతు బీమా పథకానికి ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో చనిపోయిన రైతు కుటుంబాలకు సాయం అందడం లేదన్నారు. జిల్లాలో ఏప్రిల్ 22వ తేదీన జొన్నల కొనుగోళ్లు ప్రారంభం కాగా పంటను విక్రయించిన రైతులకు ప్రభుత్వం ఇప్పటివరకు డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయలేదని తెలిపారు. నాట్లు వేసే నాటికి రైతు భరోసా ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటన చేయడం హస్యాస్పదంగా ఉందన్నారు. నాట్లకు ముందుగానే పత్తి, కంది, సోయా పంటలు వేస్తారని, వారు పెట్టుబడి డబ్బులు ఎక్కడి నుంచి తెచ్చుకోవాలని ప్రశ్నించారు. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు కమిషన్ ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారన్నారు. జిల్లాలో యాసంగిలో 1.67 లక్షల మందికి రైతు భరోసా రావాల్సి ఉండగా.. 4 ఎకరాల వరకు 90 వేల మందికి మాత్రమే వచ్చాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు 45 రోజుల్లో పనులు ప్రారంభించకపోతే రద్దు చేస్తామనడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం ప్రారంభంలో జిల్లాలో 1,02,567 మంది లబ్ధిదారులు ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య 65 వేలకు చేరిందన్నారు. ఈ పథకాన్ని ఐదు సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేస్తామని చెప్పిన కేంద్రం మాట మర్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రధానమంత్రి కృషి వికాస్ యోజన, రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన లాంటి పథకాలను రద్దు చేసిందని, పదేండ్ల కింద ఉన్న ఎరువుల ధరలు ఇప్పుడు రెండింతలు పెరిగాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు యాసం నర్సింగరావు, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేశ్, కుమ్ర రాజు పటేల్, రాజన్న, ప్రశాంత్, ఎస్‌కే, ఖలీం పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

నిర్మల్ అర్బన్, జూన్ 10 : కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. గోదాంలో సీసీ కెమెరాల పనితీరును కలెక్టర్ సమీక్షించారు. భద్రతా పరంగా లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త లు తీసుకోవాలని, పోలీస్ సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించా రు. ఈవీఎంల భద్రత, లాజిస్టిక్ ఏర్పాట్ల వంటి అంశాలపై అధికారులతో సమీక్ష చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, సిరికొండ రమేశ్, గంద్రత్ రమేశ్, హైదర్, మజర్, ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు గజానంద్, ఈడీఎం నదీమ్ తదితరులు పాల్గొన్నారు.